


# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### *ఆ నాటి బంధుత్వాలు*

**మా చిన్నతనంలో** ఇంటికి ఏ దూరపు బంధువు సరోజిని పిన్నో, (ఆవిడ వరసకి అమ్మమ్మకి మేనకోడలట. ఆ వరస ఏమిటో మాకు తెలీదు) లేదా మా లక్ష్మణరావు. (ఇతను అమ్మ పిన్ని కొడుకుకి బావమరిది) ఇతనొచ్చినా "అక్కయ్యా" అనో "అత్తయ్యా" అనో సందు చివర నుండే ఏడుస్తూ వచ్చి, అమ్మనో, అమ్మమ్మనో వాటేసుకునేవారు. ఎవరైనా చూస్తే ఏ చావు వార్తో విని వచ్చారేమో అనిపించేది. అదేం కాదు. చాలా కాలానికి చూసాం అన్న ఫీలింగ్. దీన్నే "మిస్సింగ్ ఫీలింగ్" అంటారనమాట.

ఈ పైన చెప్పిన రెండు చుట్టరికాలూ అంత దగ్గరవేం, కావు. మిస్సింగ్ ఫీలింగ్ ఎందుకబ్బా? అని మీకు అనిపించచ్చు. సరోజని పిన్నికి చిన్నతనంలోనే పెళ్ళి చేసారు. ఓ అబ్బాయి, అమ్మాయి పుట్టాక భర్త పోయాడు. అప్పటినుండీ మా అమ్మమ్మ ఆమెని స్వంత తోబుట్టువులా చూసుకుని. చదువు చెప్పించి, కుట్టు మిషన్ నేర్పించి, ఆమె స్వశక్తితో పిల్లల్ని పెంచుకునేట్లు చేసింది. ఆ కూతురు పెద్దయ్యాక పెళ్ళి చేస్తే, ఆమె కాపురమూ సరిగ్గా వుండక, ఒక కొడుకుతో తల్లిని చేరింది. మళ్ళీ అమ్మ పూనుకుని ఈ దఫా, నర్స్ కోర్స్ చేయించి, ఆమెకి పల్లెటూళ్ళలో ఉద్యోగం వస్తే, కూడా వుండి ఆ పట్వారీలూ, పటేళ్ళ వలల నుండి కాపాడి ఇల్లు చూసి పెట్టి, ఆ కొడుకుని స్కూల్లో చేర్పించి, వేసవికాలం శలవుల్లో మాతో బాటు మా ఇంట్లో పెట్టుకుని, ఇంత చేసేవారు.

తల్లి తోడులాగా వుండే అమ్మమ్మ కోసం వస్తూ, ఆ దగ్గరలో అక్కున చేర్చుకునే దిక్కు వుందన్న తలంపే ఆవిడకి అంత దుఃఖం తెప్పించేది. ఆ కాలం సంబంధాలు అలా వుండేవి.

ఇంకా లక్ష్మణరావు అన్నాను కదూ. అతను వరుసకి మాకు మేనమామకి బావమరిది. కానీ అమ్మని 'అక్కయ్య' అని పిలుస్తాడు. పదో తరగతి తర్వాత పసివేదలలో ఖాళీగా తిరుగుతుంటే, అమ్మ ఆర్.టీ.సీ.లో ఉద్యోగం వేయించింది. ఆ కృతజ్ఞతకి అతని పెళ్ళిలో వాళ్ళ అమ్మా నాన్నా మాఅమ్మకి ఆడబిడ్డ లాంఛనాలుగా ఇచ్చిన స్టీలు మంచినీళ్ళ పింపూ ఇంకా మా ఇంట్లో వున్నాయి. లక్ష్మణరావు చాలా బేల. మాట్లాడితే కళ్ళనీళ్ళు వస్తాయి. అతనికి పెళ్ళయి ఇద్దరు పిల్లలు పుట్టినా, స్త్రీ వేషాలు నాటకాలలో వేస్తూ స్వరం కూడా అలాగే వుండడంతో సరిగ్గా అతికినట్లు సరిపోయేవాడు. స్థానం నరసింహారావు గారి

ఆడవేషాలనీ, నటరాజు రామక్రిష్ణగారినీ పొగిడిన బంధువులే, ఇతన్ని ఆక్షేపించేవారు. కానీ మా అమ్మ మాత్రం లక్ష్మణరావుని తోడబుట్టిన అన్నదమ్ముడిని చూసుకున్నట్లు చూసుకునేది. అతను అమ్మ పిన్ని కొడుక్కి బావమరిది. కానీ స్వంత అక్క దగ్గర కన్నా మా అమ్మ దగ్గరే ఎక్కువ వుండేవాడు. మాకూ మావయ్యతో సమానం. ఇంట్లో మనిషి ఓసారి అమ్మ ఊరెళ్తే నాకూ అన్నయ్యకీ దోసకాయ పప్పు మినపప్పుతో వండిపెట్టి, "ఎందుకో జిగురుగా వుందిరా" అని పెట్టాడు. అంత చేదోడు వాదోడుగా వున్నాడు. అలాంటి లక్ష్మణరావు మరి సందు చివర నుండే అమ్మని చూస్తున్నానన్న ఆనందంలో కంటతడి పెట్టడం. రాగానే వాటేసుకుని "ఎంతకాలం అయింది అక్కయ్యా చూసి" అని ఏడవడం, మేము నవ్వుకున్నా, అమ్మకి తప్పుగా అనిపించేది కాదు. "వాడికి ప్రేమెక్కువ" అనేది.

ఇందాకా మా సరోజిని పిన్నికూతురు ఉద్యోగ పర్వం గురించి ఓ మాట అన్నాకదూ! తెలంగాణా పల్లెటూళ్ళలో ఊరికి మునసబ్బూ, కరణంలా పట్వారీ, పటేలూ వుంటారు. ఊళ్ళోకి అడుగుపెట్టే ముందే అక్కడకి దగ్గరగా వున్న పాలెంలో సర్కారీ దవాఖానాలో, సివిల్ సర్జన్, సూపరిటెర్ండెంట్ వుంటారు. అపాయింట్ మెంట్ ఆర్డర్స్ తెచ్చుకోమన్నారట. మా అమ్మా, పిన్నీ మధ్యాహ్నం మూడింటికి వెళ్తే చీకటి పడేదాకా ఆ సూపరింటెండెంట్, వీళ్ళని పట్టించుకోలేదుట. చివరకి ఏడు అయ్యాక అమ్మ ధైర్యం చేసి ప్యూన్‌ని పిలిచి "ఏమైనా పైసలు కావాలంటే చెప్పమను అన్నా" అంటే, ప్యూన్ నెత్తి కొట్టుకుని "మంచి ఇంటినుండి వచ్చినట్లున్నారు. ఈ ANM కొలువు ఎందుకమ్మా? ఆడికి ఆడోళ్ళ పిచ్చి" అన్నాడుట.

మా అమ్మ వీరనారి కదా ధైర్యంగా 'ముషరఫ్ ఆలీ హుసేన్' అన్న ఆ సివిల్ సర్జన్ గారిల్లు దగ్గర్లోనే వుందని తెలిసి పిన్ని తీసుకుని వెళ్ళిందట. పిన్నికి కాళ్ళదాకా పెద్ద బారు జడా, పసిమి ఛాయా, చాలా బావుండేది. ఆయన భోంచేస్తున్నారట. ఇద్దరు ఆడవాళ్ళు వచ్చారని తెలిసి, తింటూ తింటూ వచ్చి "ఏమైంది?" అని అడిగారట, పేషెంట్స్ అనుకుని.

మా అమ్మ పిన్నిని కాళ్ళమీద పారేసి "ఆ సూపరింటెండెంట్ ఆర్డర్స్ ఇస్తే కానీ ఈ రాత్రికి ఊళ్ళోకి వెళ్ళి, ఇల్లు చూసుకుని చేరలేదు. అతని ధోరణి బాలేదండీ" అందిట.

ఆయన విని, "సరే! రండి వెళ్దాం.." అని చెయ్యి కడుక్కుని వీళ్ళతో బాటు ఆస్పత్రికి వెళ్తే ముటముటలాడుతూ "ఈయన్ని ఎందుకు తీసుకొచ్చారూ? బిజీగా వున్నాను, వెయిట్ చెయ్యలేరా?" అని ఆ సూపరింటెండెంట్ అపాయింట్ మెంట్ ఆర్డర్ సంతకం చేసి ఇచ్చాడుట.

సివిల్ సర్జన్‌లాంటి దేవుళ్ళూ తగుల్తారు జీవితంలో, ఇలాంటి దానవులులాగే. అమ్మకి దేవుళ్ళ మీద ఎక్కువ నమ్మకం.

ఇంక ఆ వంద గడపకూడా సరిగ్గా లేని ఊళ్ళో పట్వారీ ఇంటికి వెళ్ళి ఆర్డర్స్ చూపిస్తే "సరే నేను సెప్పిన తావుల వుండాలె. నేను అచ్చి పోతుంటా" అన్నాడుట.

అమ్మ ధైర్యంగా "గుడి పూజారిగారు మా బంధువులు. అక్కడే వుంటుంది" అనేసిందట. అప్పుడే వీళ్ళు వస్తూ వస్తూ గుడికి వెళ్ళొచ్చారు. పట్వారీ పూజారికి కబురు పంపితే, పడుతూ లేస్తూ వచ్చాడుట. "ఏంది వీళ్ళని ఇంట్ల వుంచుకుంటావా?" అంటే ఆ గద్దింపుకి అతను భయపడిపోతూ చూసాడుట, "వీళ్ళ అమ్మగారితో మేం మాట్లాడాం" అందిట అమ్మ.

అతను తల గోక్కుని "మా అత్తగావచ్చు.. రండి తోలక పోతా" అన్నాడుట.

అతనికి ఓ మేనత్త, తెల్ల పంచె కట్టుకున్న గుండు మామ్మగారు, వాళ్ళని చూసి "బాపనోళ్ళేనా.. అసింటా వుండండి. పెరుమాళ్ళుకి నివేదన చేస్తున్నా" అని, వాళ్ళని దూరంగా పెట్టి తరువాత "నేను ఒక్కదాన్నే వుంటా. నేనూ వైద్యమే చేస్తా. కానీ పురుళ్ళు చెయ్యను. నువ్వు వచ్చి మంచి పని చేస్తివి. పక్కన వున్న గదిలో వుండు" అందిట.

ఆవిడంటే పటేలుకీ పట్వారీకీ బాపనమ్మ పూజలు చేస్తుందని భయంట. అలా ఆవిడ కాపాడింది.

"పొద్దుగాల పొద్దుగాల గుమ్మడిపూలు పొప్పులో వేసి, పెరుమాళ్ళుకి నివేదన చేసి, ఎవరికో తేలు మంత్రం ఎయ్యాలంట పొయ్యొస్తా" అని ఆవిడ వెళ్ళేది. నేనూ చూసాను ఆవిడ్ని. ఆవిడ వెళ్ళిన పూట వంట చేసుకుంటుంటే, లేత గోరు చిక్కుడు కాయలిచ్చింది. ఆవిడ చేత వైద్యం చేయించుకున్న వాళ్ళు అలా కూరలూ, పాలూ ఇచ్చేవారు. ఆ గోరు చిక్కుడ్లు వేయించి అమ్మ ఉప్పూకారం చల్లింది. ఆ లేత గోరు చిక్కుడు వేపుడు అంత రుచి. ఇప్పటికీ మరిచిపోలేను.

ఇంతసేపూ అన్నాడుటా. అందిటా అని ఎందుకు రాసానంటే, అప్పుడు నేను చాలా చిన్నపిల్లని పెద్దవాళ్ళు ఏం మాట్లాడుకున్నారో, ఏం జరుగుతుందో అర్థం అయ్యే వయసు కాదు. ఆకలి అని ఏడిస్తే అమ్మ ఏ మరమరాలుండలో, కారప్పూసో పెట్టేది. తిని కూర్చునేదాన్ని మాట్లాడకుండా.

ఇప్పుడు చెప్పండి మరి ఇవి దూరపు చుట్టరికాలు అనగలమా? ఎక్కడో మా తాతయ్య వేలు విడిచిన అక్క మనవరాలు ఈ పిన్ని.

అలా ఆ ఊళ్ళో అడుగు పెట్టిన పిన్నిని విడిచి "దేనికీ భయపడకు, సివిల్ సర్జన్ గారికి చెప్పు. ఇబ్బంది పెడితే ఎవరైనా" అని అమ్మ నన్ను తీసుకుని వచ్చేసింది.

ఆ ఊళ్ళో కొంతకాలానికి పిన్నికి అందరూ భయపడేట్లు, ఝుణఝుణలాడిస్తూ, నెగ్గుకొచ్చింది. మళ్ళీ శలవులకి వెళ్ళినప్పుడు, పిన్నితో వెళ్ళి డెలవరీ కూడా ఎలా చేస్తారో, ఆ వయసులోనే చూసిన అనుభవం నాది. పిన్ని హస్తవాసి మంచిదని, చుట్టుపక్కల ఊళ్ళనుండి కూడా ప్రసవం కోసం వచ్చేవారు. జున్నుపాలూ, తాటి ముంజెలూ, తేగలూ, సొరకాయలూ, పొట్లకాయలూ, జామకాయలూ, అబ్బో అదంతా నా చిన్న తనంలో రాణీభోగం లెండి నాది.

మా అమ్మ ఆఫీసు వాళ్ళిచ్చిన చిన్న క్వార్టర్‌లో ఎవరెవరో దూరపు బంధువులు వచ్చి వుండేవారు. ఉద్యోగం కోసం, ఆస్పత్రిలో చూపించుకోడం కోసం కోర్టు పనులకీ కూడా. అమ్మ అందర్నీ ఆదరించేది. అమ్మమ్మ అన్నపూర్ణలా అన్నం పెడ్తూ వుండేది. తాతయ్య బతికుండగా, స్వాతంత్రోద్యమంలో వున్నదంతా దేశానికే పెట్టాడు. ఏమీ మిగల్చలేదు. కానీ అంతులేని సంపద ఒకటి ఇచ్చాడు. అది తెగువ. మొండి ధైర్యం. మా అమ్మమ్మని హాస్టల్‌లో పెట్టి దుర్గాబాయి దేశ్‌ముఖ్‌లో చదివించాడు. ఆవిడ ఎంతో నిబ్బరంగా ముగ్గురు ఆడపిల్లల్ని చదివించుకుని, వాళ్ళకి ప్రభుత్వ వుద్యోగాలు వచ్చేట్లు చేసింది. మా అమ్మకన్నా ధైర్యస్తులూ, కార్యశూరులూ మా పెద్దమ్మలు. వాళ్ళ పెంపకంలో మేం పెరిగాం.

నేను ఇచ్చిన లీడర్ చదివాక, అక్కినేని నాగేశ్వరరావుగారు నాకు ఆప్తమిత్రులయ్యారు. రామానాయుడుగారు, అల్లు అరవింద్ గారూ, పరుచూరి బ్రదర్స్... ఎవరైనా కానీ 'నీకేం తల్లీ సూరంపూడి శ్రీహరి రావుగారి మనవరాలివీ, రమణమ్మగారి వారసురాలివీ.. నీకేం భయం? " అనేవారు. నేనంటే వాళ్ళకి ఓ అభిప్రాయం, ఆపాయ్యతా, గౌరవం ఇచ్చింది. నేను రాసిన లీడర్ అన్న మా వంశ చరిత్ర.

ఈ రోజున మా అమ్మమ్మ మనవలం అందరం తినే 'ముద్ద' ఆనాడు అమ్మమ్మ ఆదరణగా నలుగురికీ పెట్టిన పుణ్యఫలమే.

Post your comments










https://www.youtube.com/watch?v=ERaaX_IulS4